సాక్షి బాపట్ల

మంగళవారం, 16, జూలై, 2024



భక్తులకు రక్షణ కల్పించాలి

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ రామలింగేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలని ఏఎస్పీ లక్ష్మీపతి సోమవారం సిబ్బందికి సూచించారు.



భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

బెల్లంకొండ: బెల్లంకొండలో సోమవారం పీర్లను వైభవంగా ఊరేగించారు. మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ, వన్నాయపాలెం తదితర గ్రామాల్లో ఊరేగింపు చేశారు.

విజయవారాహి అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విజయ వారాహిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

పెన్సిల్ మొనలపై నెల్సన్ మండేలా జీవిత చరిత్ర

స్వర్ణ సూక్ష్మ కళాకారిణి మహిత ప్రతిభ





స్వర్ణ(కారంచేడు): దక్షిణాఫ్రికా కాంతి కిరణం, నోబెల్ శాంతి బహుమతి అవార్డు గ్రహీత నెల్సన్ మండేలా జీవిత చరిత్రను బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం మహిత పెన్సిల్ మొనలపై రాసి అందరినీ అబ్బురపరచింది. ఈమె కొంత మంది మహానుభావుల జీవిత చరిత్రలను పెన్సిల్ మొనలపై చెక్కుతూ శభాష్ అనిపించుకుంటోంది. ఆమె తయారు చేసిన నెల్సన్‌మండేలా జీవిత చరిత్ర ఫ్రేమ్‌ను ఈనెల 18వ తేదీన ఆయన జయంతిని పురస్కరించుకొని దక్షిణాఫ్రికాకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మహిత తల్లిదండ్రులు అన్న నరసింహారావు, భ్రమరాంబ తెలిపారు.

రూ.15 కోట్లతో ఔషధ వ్యాపారి పరారీ

నరసరావుపేట టౌన్: హోల్‌సేల్ ఔషధ వ్యాపారి రూ.15 కోట్లతో ఉడాయించిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. అప్పులిచ్చిన బాధితులు సోమవారం వ్యాపారి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కుటుంబంతో సహా నాలుగు రోజుల కిందటే ఊరు విడిచి వెళ్లినట్లు తెలుసుకొని బాధితులు ఆందోళన చేశారు. వివరాలు.. విద్యుత్ కార్యాలయం వెనుక ప్రాంతంలోని అలవాల బజార్‌లో నివాసం ఉంటున్న ఔషధ వ్యాపారి కోట సెంటర్‌లో 15 ఏళ్లుగా హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం బాగా చేస్తూ తీసుకున్న అప్పులకు సకాలంలో వడ్డీలు చెల్లిస్తుండటంతో నమ్మిన వడ్డీ వ్యాపారులు, స్నేహితులు అధిక మొత్తంలో డబ్బులు వడ్డీకి ఇచ్చారు. 20 రోజుల కిందట దుకాణంలో ఉన్న స్టాక్ మొత్తాన్ని రూ.5 కోట్లకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. దీంతోపాటు చీటిపాటలు పాడి నగదు కూడబెట్టుకున్నాడు. నాలుగు రోజుల కిందట కుటుంబ సభ్యు లతో సహా ఇంటికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో వడ్డీ వ్యాపారులు ఆరా తీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. వ్యాపారి ఇంటివద్దకు పెద్ద సంఖ్యలో బాధితులు వచ్చారన్న విషయం తెలుసుకున్న ఓ బ్యాంక్ ప్రతినిధులు ఇల్లు తమ బ్యాంక్ తాకట్టులో ఉందని నోటీసు అంటించారు. ఇంటిని తనఖా పెట్టి సుమారు రూ.3 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు సమాచారం. బాధితులంతా కలిసి పోలీసులను ఆశ్రయించాలని సన్నద్ధం అవుతున్నారు.

భ్రమరాంబకు ఆషాఢ సారె



పెదకాకాని: శివాలయంలో కొలువుదీరిన భ్రమరాంబ అమ్మకు పెదకాకాని గ్రామానికి చెందిన వీరిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సోమవారం ఆషాఢసారె సమర్పించారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీ రామ వరప్రసాదరావు, ఆలయ స్థానాచార్యులు పొత్తూరు సాంబశివరావు అర్చకులు వేద మంత్రోచ్చరణలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం భ్రమరాంబ అమ్మవారికి చీర, పసుపు కుంకుమ, వివిధ రకాల పండ్లు, పూజా సామగ్రితో లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించారు.

చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో జీవిత ఖైదు

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొత్తూరు కు చెందిన నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేసి, హత్య చేసిన కేసులో ముద్దాయి కేతావత్ బాలునాయక్‌కు గుంటూరు పోక్సో కోర్టు జడ్జి కె.నీలిమ జీవితఖైదు విధించినట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభిరామయ్య సోమవారం తెలిపారు. వివరాలు.. నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన బాలునాయక్ అలియాస్ పుల్లునాయక్ 2018వ సంవత్సరంలో కొత్తూరు గ్రామంలో 4 ఏళ్ల చిన్నారిని ఊరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు తీసుకువెళ్లి లైంగికదాడి చేసి హత్య చేశాడు. అప్పటి ఎస్‌ఐ ఎం.వాసు కేసు నమోదు చేయగా, నాటి గురజాల డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. గుంటూరు అర్బన్ జిల్లా వెస్ట్ డివిజన్ డీఎస్పీ కేజీవీ సరిత చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నేరం రుజువు కావటంతో ముద్దాయి బాలునాయక్‌కు పోక్సో కోర్టు జడ్జి జీవిత ఖైదు విధించినట్లు ఎస్‌ఐ వివరించారు.

భృతి సంగతేంటి!



ఆశల పల్లకిలో యువత

- ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులు
- నెలకు రూ.3 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- నెల దాటినా నోరుమెదపని కూటమి సర్కారు
- గతంలోనూ భృతి ఇస్తామని మాటతప్పిన బాబు
- ఆందోళనలో నిరుద్యోగ యువత
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



'ఈ ఫొటోలో కనిపిస్తున్న యువతి పేరు పాముల కృపమ్మ. కొల్లూరు మండలం చిలుమూరు. బీఈడీ పూర్తి చేసింది. డీఎస్సీ కోసం ఎదురు చూస్తోంది. భర్త చిన్నపాటి ఉపాధితో గ్రామంలో జీవిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీపై ఆశలు పెట్టుకుంది. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో కోచింగ్‌కు చేరింది. భృతి ఇస్తే కోచింగ్ ఖర్చులకు వెసులుబాటు ఉంటుందని భావిస్తోంది.' ఎన్నికల హామీ మేరకు భృతి ఇవ్వాలని ఈమె కోరుతోంది.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్రంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తోంది. తాజాగా గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని గంపెడాశ పెట్టుకుంది. చిన్నపాటి ఉద్యోగం దొరికినా ఇన్నాళ్లు తమ చదువుల కోసం ఆర్థిక భారం మోసిన కుటుంబానికి కాస్త ఆసరాగా నిలవచ్చని ఆశిస్తోంది. ఉద్యోగం ఇవ్వడం ఆలస్యమై నిరుద్యోగ భృతి లభించినా కాస్త ఉపశమనం దక్కుతుందని ఎదురు చూస్తోంది.

బాబూ హామీతో..

సంపద సృష్టించి చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తానని చంద్రబాబు ఎన్నికల ముందు ఊదరగొట్టారు. దీంతో నిరుద్యోగులు గడచిన ఎన్నికల్లో కూటమి పార్టీలకు మద్దతుగా నిలిచి ఓట్లేసి గెలిపించారు.

ప్రభుత్వం వచ్చి నెల గడుస్తున్నా..

ప్రభుత్వం ఏర్పడి నెలకావస్తున్నా బాబు సర్కారు ఉద్యోగాల సంగతి దేవుడెరుగు నిరుద్యోగ భృతి విషయాన్ని పక్కకు నెట్టింది. పైగా పలురకాల ఆంక్షలతో మరోమారు నిరుద్యోగ భృతికి గండికొట్టేందుకు ప్రయత్నిస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే మెగా డీఎస్సీ అని చంద్రబాబు ఆర్భాటంగా సంతకం చేశారు. ఉద్యోగాల కల్పన అంటూ ప్రకటనలతో హోరెత్తించారు. పచ్చ పత్రికలు పతాక శీర్షికలు రాశాయి. ఆ తర్వాత డీఎస్సీపై కదలికలు లేవు. ఎన్నికల్లో హామీలు ఇచ్చిన మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఉద్యోగ ఖాళీల భర్తీ ఎప్పటికి మొదలవుతుందో అంతుపట్టని పరిస్థితి.

భృతిపై స్పందనేదీ? ఎన్నికల సమయంలో ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చేవరకూ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. ఆయన గద్దెనెక్కి నెల దాటుతున్నా భృతి ఊసు ఎత్తడంలేదు. 2014లోనూ చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని నమ్మబలికారు. అధికారంలోకి వచ్చాక ఎగనామం పెట్టి హామీని నట్టేట ముంచారు. ఈ ఎన్నికల్లోనూ అదే హామీతో యువతను మభ్యపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చి నెల కావస్తున్నా భృతిపై ముందడుగు పడలేదు.

ఆశలు నెరవేరేనా..

కూటమి పాలనలో ఉద్యోగాలు లభిస్తాయని, లేకుంటే నిరుద్యోగ భృతి లభిస్తుందని యువత ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే చదువుకోసం, ఇతర నైపుణ్య శిక్షణల కోసం రూ.లక్షల్లో వెచ్చించి వారి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఉద్యోగాలు ఆలస్యమైనా నిరుద్యోగ భృతి తమను కొంత మేర ఆదుకుంటుందన్న ఆశతో యువత ఇప్పటికీ స్టడీ సర్కిళ్లు, ఇతర శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. ఉద్యోగాల కల్పన ఆలస్యమైనా ఇచ్చిన మాటమేరకు కూటమి ప్రభుత్వం కనీసం సకాలంలో భృతి ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాల్సిఉన్నా ఆ దిశగా కదలికలు కనిపించడం లేదు.

జిల్లాలో నిరుద్యోగులు ఇలా...

ఇంటికొక నిరుద్యోగి.. ఇప్పటికే జిల్లాలో సగటున ఇంటికి ఒకరు చొప్పున చదువుకొన్న నిరుద్యోగులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో 459 గ్రామ పంచాయతీల పరిధిలో 944 గ్రామాలు ఉండగా వాటి పరిధిలో 4,97,000 గృహాలు ఉన్నాయి. ఈ లెక్కన ఇంటికొక నిరుగ్యోగి అనుకున్నా జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారంతా ఉద్యోగాలతోపాటు తక్షణ సాయంగా నిరుద్యోగ భృతిని ఆశిస్తున్నారు.

వైఎస్ జగన్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం చదవుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించింది. జిల్లాలో 477 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి 5,247 ఉద్యోగాలు కల్పించింది. పట్టణ.గ్రామీణ ప్రాంతాల పరిధిలో వేలాది మందికి వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చింది. 348 హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి 348 ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలు కల్పించింది. ఇవి కాకుండా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చింది. ఇక ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది. పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచి వారి శ్రమను గుర్తించింది. ఇవి కాకుండా ఎంఎస్‌ఎంఈల ద్వారా జిల్లాలో 705 యూనిట్లు ఏర్పాటు చేసి వారికి రూ.110.69 కోట్ల మేర రాయితీలు కల్పించింది.



'కూటమి అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తాం.'
-మే ఒకటో తేదీ చీరాలలో జరిగిన సభలో చంద్రబాబు

మాట నిలబెట్టుకోండి



డిగ్రీ పూర్తి చేసి ఐదేళ్ల అయింది. ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నా. ఎన్నికల ముందు చంద్రబాబు చదువుకున్న నిరుద్యోగులకు ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇస్తాన్నాడు. ఉద్యోగం వచ్చే వరకు ఆర్థిక సాయం కింద భృతి చెల్లిస్తానని వాగ్దానం చేశారు. ఇస్తే నిరుద్యోగులకు వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది. నిరుద్యోగలకు త్వరగా భృతి ఇవ్వాలి.

–దొప్పలపూడి జ్యోతి బాబు, వేమూరు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తామన్న నెలకు రూ.3 వేల భృతిని వెంటనే ఇవ్వాలి. ఇందుకోసం మార్గదర్శకాలు రూపొందించి తక్షణమే అమలు చేయాలి. ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు బాబు ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఇప్పుడు అలా చేయకుండా నిరుద్యోగులు కోచింగ్ తీసుకునేందుకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలి.

– పి.మనోజ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, బాపట్ల

ఉపాధి లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలి..

నేను బీటెక్ పూర్తి చేసి రెండు సంవత్సరాలు అయ్యింది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఇంత వరకు ఉద్యోగం రాలేదు. డిగ్రీలు, పీజీలు చేసి నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది యువత ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా వారికి అవసరమైన ఉపాధి కల్పించాలి. లేదా అంతవరకు వారికి నిరుద్యోగ భృతిని ఇచ్చి ఆదుకోవాలి. ఉద్యోగం వచ్చేంత వరకు మా లాంటి యువత తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఉండేందుకు భృతి ఇస్తే బాగుంటుంది.

– వీ సింధూర, బీటెక్, కారంచేడు

ఉసూరు మనిపించరాదు



నేను డిగ్రీ చేశాను. ఎన్నికల ముందు టీడీపీ ఉద్యోగాలు కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. నెల రోజులు గడిసింది. ఇంత వరకు భృతిపై స్పందించడం లేదు. ఇప్పటికే మా లాంటి నిరుద్యోగులం కోచింగ్‌లు తీసుకునేందుకు డబ్బులు ఖర్చు చేసుకుంటున్నాం. భృతి వస్తే కొంతమేర ఖర్చు తక్కుతుందని ఆశతో ఉన్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.3 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలి.

-బొనిగల దీప్తి, కొల్లూరు, బాపట్ల జిల్లా

ఎప్పుడిస్తారో చెప్పండి!



ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటింది. నిరుద్యోగ భృతిపై ఇంకా నోరుమెదరేం.. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో ప్రకటించాలి. గతంలో 2014–19 చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తానని యువత ఓట్లు వేయించుకొని మాట తప్పారు. ఇప్పుడు కూడా మళ్లీ బురిడీ కొట్టిస్తాడేమోనని నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారు.

–మాచవరపు రవికుమార్, కార్యదర్శి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం

ఎదురుచూస్తున్నాం..



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగులందరికీ ఇస్తామని చెప్పింది. నమ్మించి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి గురించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించి హామీని నిలబెట్టుకోవాలి.

– వై.వెంకారెడ్డి నిరుద్యోగి, మేదరమెట్ల

వెంటనే హామీ అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికలముందు చెప్పినట్లు చదువుకున్న నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే అందజేయాలి. ముందు దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. చాలా మంది యువత చదువుతోపాటు శిక్షణ తీసుకొనేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవరకూ వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– జి.కోటేశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకుడు, బాపట్ల

అర్జీలపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 112 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్ని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి అర్జీని అధికారులు పరిశీలించాలని, తన పరిధిలో పరిష్కరించే అంశాలపై దృష్టి సారించాలని కోరారు. రేపల్లె ఆర్డీఓ పరిధిలో మూడు, విద్యుత్ శాఖలో రెండు, మునిసిపాలిటీలో మరొకటి మిగిలినవి ఆయా శాఖల్లో ఇప్పటికే 17 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మీ వద్దకు వచ్చిన బాధితులకు సాధ్యమైనంత వరకు మీ పరిధిలో న్యాయం చేయండి. అలా చేయలేకపోతే సాధ్యం కాదని వివరిస్తూ స్పష్టంగా చెప్పాలని పేర్కొన్నారు. ఆర్ఓఆర్‌లో ఉన్న వివరాలు పూర్తి స్థాయిలో స్థిరంగా ఉంటాయని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వలు, చెరువుల పూడికతీత పనులలో వంద రోజులు పని దినాలు తగ్గకుండా నిరుపేదలకు ఉపాధి చూపాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ కోరారు.నకిలీ విత్తనాలతో వివిధ పంటలు సాగు చేసే రైతులు, ఆక్వా రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాల్వల మరమ్మతులపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రస్తుతం కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి నీరు విడుదలైనందున తాగునీటి చెరువులన్నిటిని పూర్తిగా నింపాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త డంప్ చేయడం, తగుల పెట్టడం వంటివి చేయరాదని హెచ్చరించారు. చెత్త సంపద కేంద్రాలు నూరు శాతం వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. వేటపాలెంలో పశువులకు వైద్యం అందడం లేదనే ఆరోపణలపై ఆరా తీశారు. డెప్యూటేషన్‌పై విశాఖ జిల్లాకు వెళ్లిన సదరు వైద్యాధికారి వేతనం నిలిపివేయాలని, తక్షణమే నోటీస్ జారీ చేయాలన్నారు. అనుమతులు లేకుండా జిల్లా అధికారులు బాపట్ల కేంద్రాన్ని దాటి వెళ్లరాదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై ఈనెల 18వ తేదీ నుంచి ఇంటింటా పరిశీలన జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు సేకరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

నల్లమడ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలి

నల్లమడ ఆధునికీకరణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాకు ప్రధాన వనరుగా ఉన్న నల్లమడను ఆధునికీకరణ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు.

-మానం విజేత, మాజీ ఎంపీపీ

దివ్యాంగుల కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

దివ్యాంగుల కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలి. జాతీయ రహదారి పనులు సందర్భంగా పైపులైన్లు పగిలిపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 20 రోజులుగా తాగునీరు లేదు. దివ్యాంగులకాలనీ మంచినీటి సౌకర్యం కల్పించాలి.

-చల్లా రామయ్య, స్థానికుడు

అట్టహాసంగా జగన్నాథ రథయాత్ర



గుంటూరు నగరంలో జగన్నాథుని శోభయాత్రకు హాజరైన భక్తులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగర వీధుల్లో జగన్నాథ రథయాత్ర అట్టహాసంగా జరిగింది. రహదారుల వెంట బారులు తీరిన భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. జై జగన్నాథ నినాదాలతో వీధులు మార్మోగాయి. గుంటూరు మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ గుంటూరు మందిరం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం హిందూ కళాశాల కూడలిలో యాత్ర ప్రారంభమైంది. గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ కొబ్బరికాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. జిన్నాటవర్ సెంటర్, శ్రీవిజయటాకీస్, నాజ్ కూడలి, ఏసీ కళాశాల, అరండల్‌పేట ఫ్లైఓవర్, బ్రాడీపేట, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ మీదగా పట్టాభిపురం, కంకరగుంట ఫ్లైఓవర్ మీదగా ఏటీ అగ్రహారం జీరో వీధి నుంచి మల్లారెడ్డినగర్ వరకు యాత్ర సాగింది. అనంతరం మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ప్రవచనాలు, జగన్నాథుని లీలలను వక్తలు వివరించారు. ఇస్కాన్ భక్త బృందంతో సంకీర్తనలు, భజనలు, నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన వితరణ చేపట్టారు. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు పుండరీకాక్ష గోవింద్ ప్రభు, మందిర సహ అధ్యక్షులు దయానిధి ప్రభు, అయ్యప్ప స్వామి దేవాలయం, ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, రేమాండ్ షోరూం నిర్వాహకులు అరుణ్, శ్రీకాంతగోవిందదేవదాసు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు



యార్డుకు 29,930 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,930 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,747 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.10,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,530 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,115 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 264 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 43 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 87 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 198 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1080 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్‌కు నీరు విడుదల చేయలేదు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌లో బంగారు పతకాలు



బంగారు పతకాలను సాధించిన క్రీడాకారులు

బాపట్ల: బాపట్ల స్విమ్మర్లు రాష్ట్ర స్థాయి బంగారు పతకాలు సాధించారని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మురళి తెలిపారు. ఈ మేరకు పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక క్రీడాభవనంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో బాపట్లకు చెందిన వారు పది బంగారు పథకాలు, మూడు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. సిమ్మర్లు బేతాళం హర్షవర్ధన్‌రాజు, శ్రీదీక్ష, సిహెచ్.అవిఘ్నా, కె.లాసశ్రీలను అభినందించారు.

హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరణం రవీంద్రబాబు

బాపట్ల: హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరణం రవీంద్రబాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం మహాసభలో నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా కె.హరిబాబు, లియాఖత్ ఆలి, ప్రధాన కార్యదర్శిగా షేక్ దరియావలి, సహాయ కార్యదర్శులు డి.రాజశేఖర్, సింహాద్రి, యల్లమందారెడ్డి, ట్రెజరర్ రేజేటి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా షేక్ బాబు జి.పర్వతయ్య, కె.వి.వి.సత్యనారాయణ, వరికూటి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

– అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



బాధితులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్లటౌన్: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 43 మంది ఎస్పీ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను అడిషనల్ ఎస్పీకు విన్నవించారు. బాధితుల సమస్యలను తెలుసుకున్న అడిషల్ ఎస్పీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలోని పోలీసులతో మాట్లాడుతూ వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రజల సమస్యలపై ప్రతి ఒక్క అధికారి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక సీఐ సిహెచ్.సింగయ్య పాల్గొన్నారు.

మొక్కలతోనే.. మానవజాతి మనుగడ

జిల్లా సమగ్రశిక్ష జీసీడీఓ చారులత



కేజీబీవీలో మొక్కలు నాటుతున్న జీసీడీవో, విద్యార్థులు

బల్లికురవ: మానవజాతి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందని జిల్లా సమగ్రశిక్ష జీసీడీఓ చారులత పేర్కొన్నారు. సోమవారం బల్లికురవలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో 'అమ్మపేరిట మొక్క నాటుదాం' కార్యక్రమంలో భాగంగా విద్యాలయంలో ఆమె బాలికలతో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటించారు. జీసీడీఓ మాట్లాడుతూ మొక్కలు అంతరించటం వల్లే కాలుష్యం పెరిగిపోయిందన్నారు. దీంతో పాటు సకాలంలో వర్షాలు కురవటం లేదని మానవజాతి ప్రస్తుత సమాజంలో బతకాలంటే పర్యావరణాన్ని రక్షించాలని పేర్కొన్నారు. అందుకు మనమందరం ప్రకృతిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థిని ఓ మొక్కను నాటి పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ కోనా సరళకుమారి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్‌లో విద్యార్థినికి ప్రథమ స్థానం



విద్యార్థిని అక్షరను అభినందిస్తున్న మల్లేశ్వరి, తల్లిదండ్రులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి చాంపియన్‌షిప్‌లో సుమేధ హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్జీఓ కాలనీలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 13, 14వ తేదీల్లో తాడేపల్లిలో జరిగిన 51వ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-11 బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన సంకట సాయి అక్షరను అభినందించారు. జిల్లాస్థాయిలో అనేక మంది క్రీడాకారులతో పోటీపడిన తమ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యతోపాటు ఆట, పాటలతో కూడిన విధానంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మల్లేశ్వరి, హెచ్ఎం రాంబాబు, పీఈటీ కిరణ్‌రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు సంకటి దుశ్యంత్ రెడ్డి, ప్రశాంతి, తాతయ్య జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

కుష్టు వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో పెద్ది రోజా, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, దీన్లో భాగంగా కుష్టు వ్యాధి నిర్మూలనను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చే నెల 2 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలించే రోగమన్నారు. దీని బారిన పడ్డ బాధితులు ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నో ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. క్రమం తప్పకుండా ఎండిటి (మల్టీ డ్రగ్ థెరపి) మందును వేసుకోవాలన్నారు. వీటిని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలైన చర్మంపై స్పర్శలేకపోవడం, మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడంలాంటి లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి నిర్వహించిన సర్వేలో కొత్తగా 13 కేసులను గుర్తించామన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్‌ను 322 ఇస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్, అధికారులు కుష్టు వ్యాధిపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసులు, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒప్పందం ప్రకారం రైతుల ఖాతాల్లో రూ.7వేలు వేయాలి

పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజి యాజమాన్యానికి, బాధిత పసుపు రైతులకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రైతుల ఖాతాల్లో రూ.ఏడు వేలు వేయాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు కోరారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పంటను భద్రపరుచుకుని నష్టపోయిన రైతుల సమావేశం సోమవారం దుగ్గిరాలలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివశంకరరావు మాట్లాడుతూ 2024 జనవరి 19న దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో దగ్ధమైన పసుపు రైతులకు క్వింటాకు రూ.12,500 ఇవ్వాలని వివిధ రూపాలలో అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు సమక్షంలో రైతు సంఘాల ప్రతినిధి బృందం, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్య బృందం, మార్కెఫెడ్ మార్కెట్ తెనాలి సబ్ కలెక్టర్ సమక్షంలో క్వింటాకు రూ.7 వేలు ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. సొసైటీ లోన్స్, బ్యాంక్ లోన్స్ ఎత్తివేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం మద్దతు ధరలు చట్ట రూపం తేవాలని, 2022-23, 2023-24 సంవత్సరాల్లో రబీ, ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు వెంటనే బీమా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పసుపు రైతు సంఘం కమిటీ సభ్యులు ములక శివసాంబిరెడ్డి, రైతు సంఘం నాయకులు అమ్మిరెడ్డి, వై. బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. లాలాపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, ఎస్ఐ ఎం.సుబ్బారావు సోమవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. నల్లచెరువుకు చెందిన షేక్ కరిముల్లా, నిమ్మలపేటకు చెందిన చల్లా ఈశ్వరరావు, అదే ప్రాంతానికి చెందిన బత్తుల శ్రావణ్‌కుమార్ లాలాపేటలోని పీకలవాగు కట్ట డంపింగ్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సులభతరంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భద్రాచలం, ఒడిశా, ప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందుతులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ రవి, శంకర్, కిరణ్‌లను ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్ అభినందించారు.

నిందితుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదం చేసి కోర్టుకు హాజరు కాకపోవడంతో సోమవారం మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వర్లు కథనం.. కరకట్ట మీద మెల్లెంపూడి సమీపంలో పెదవడ్లపూడి ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. అప్పట్లో ప్రమాదానికి కారణమైన కొప్పుల రమేష్‌ను అరెస్ట్ చేశామని, అప్పటి నుండి కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చిందని, సురేష్‌ను పెదవడ్లపూడి వద్ద అదుపులోకి తీసుకుని మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా నిందుతుడు సురేష్‌కు ఏడు రోజుల రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

కడప జట్టు.. 35 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా కడప, చిత్తూరు జిల్లాల మ్యాచ్‌కు వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా తొలిరోజు ఆదివారం ఆట రద్దు కాగా, సోమవారం రెండవరోజు ఆట ప్రారంభమైంది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కడపజిల్లా జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 35 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఏర్పడిన అంతరాయంతో కేవలం 14 ఓవర్లు మాత్రమే ఆడారు. కడప ఓపెనర్లు జి.వి.సాయిసాకేత్ 25, ఎం.అజిత్‌ఆనంద్ 7పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మంగళవారం మూడవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

జీపీఎస్ అమలు గెజిట్‌ను రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

యడ్లపాడు: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) పల్నాడు జిల్లా అధ్యక్షుడు బెజ్జం సంపత్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటరెడ్డితో కలిసి ఓ ప్రకటనను విడుదల చేశారు. తాజాగా అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించి కొత్త జీపీఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఇందులో భాగంగా గెజిట్‌ను సైతం విడుదల చేయడం సరికాదన్నారు. ముందుగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులకు మేలు చేసే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

జాతీయ స్కాలర్‌షిప్‌లకు సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక



స్కాలర్‌షిప్‌లు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

- బాపట్ల, ప్రకాశం జిల్లాలో మొదటి స్థానం
- రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం కైవసం
- 32 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్

వేటపాలెం: జాతీయస్థాయిలో నిర్వహించే స్కాలర్‌షిప్‌లలో సెయింట్ ఆన్స్ కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జాతీయ ప్రగతి స్కాలర్‌షిప్‌ల మంజూరులో బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. సెక్రటరీ మాట్లాడుతూ ఇటీవల ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రకటించిన జాతీయస్థాయి ప్రగతి స్కాలర్‌షిప్‌లో కళాశాలకు చెందిన 32 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. బీటెక్ చెంది 30 మంది, డిప్లమా విద్యార్థులు ఇద్దరు స్కాలర్‌షిప్‌లను కైవసం చేసుకునట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏడాది రూ. 50 వేలు చొప్పున నాలుగు ఏళ్లలో రూ.2 లక్షలు అందుకుంటారని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు చదువుల్లో మంచి శ్రద్ధ కనబరచి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. జాతీయస్థాయి ప్రగతి స్కాలర్‌షిప్‌లు సాధించిన విద్యార్థులను కళాశాల అక్రిడిటేషన్స్ డైరక్టర్ సి సుబ్బారావు, ఎస్ అమరనాథ్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం



మార్టూరు: ఆర్థిక ఇబ్బందులు.. అప్పుల బాధలు తట్టుకోలేక ఓ యువతి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ మహబూబబాషా వివరాల మేరకు..

వలపర్ల వడ్డెర కాలనీకి చెందిన తస్నీరు సుజాత(35) కుటుంబ అవసరాల కోసం తెలిసిన వారి దగ్గర సుమారు రూ.5 లక్షలు అప్పులు చేసింది. అప్పులు తీరే మార్గం కనిపించక సుజాత మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు కిందకు దించేసరికి అప్పటికే ఆమె మృతి చెందింది. సుజాత భర్త అంకమ్మరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా వీరికి 7, 9, సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. సుజాత తల్లి గుంజి రాజేశ్వరి సోమవారం రాత్రి స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుంటూరు చానల్ పొడిగింపుకు నిధులు కేటాయించాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతు సంఘ నాయకులు



మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కుంచుమాటి అజయ్‌కుమార్ కోరారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రాంతంలో గుంటూరు చానల్‌ను పొడిగించాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు లభించే ఈ కీలకమైన ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదు అన్నారు. 2018లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం చానల్ పొడిగింపుకు జీవో జారీ చేసిందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర, ఇంటూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా వ్యాప్తంగా వర్షం

- దుగ్గిరాలలో అత్యధికంగా 22.8 మి.మీ.
- సగటున 5.4 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులతో కూడిన వర్షం పడుతోంది. జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 22.8 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో ఒక మి.మీ చొప్పున వర్షం పడింది. సగటున 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదకాకాని మండలంలో 12 మి.మీ., చేబ్రోలు 8, తెనాలి 6.2, తాడేపల్లి 5.8, పొన్నూరు 5.6, మేడికొండూరు 5, పెదనందిపాడు 4.6, కొల్లిపర 4.4, ప్రత్తిపాడు 4, వట్టిచెరుకూరు 3.8, గుంటూరు పశ్చిమ 3.4, మంగళగిరి 3.4, తాడికొండ 2.2, కాకుమాను 1.8, ఫిరంగిపురం 1.8, తుళ్ళూరు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ 15వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 176.9 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 278.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: స్టాక్ పాయింట్ల నుంచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అధిక ధరలకు విక్రయించకుండా చూడాలన్నారు. దీనికోసం అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ సాగించాలన్నారు. అక్రమాలు గుర్తిస్తే కేసులు నమోదు చేసి, పెనాల్టీలు వేయాలన్నారు. ఇసుకపై వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయపూడి వద్ద పూడికతీతకు మైన్స్, జియాలజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో 10 రోజుల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. దుగ్గిరాల మండలం పెదకొండూరులో సీజ్ చేసిన 5,003 మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్‌గా గుర్తించి విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరా చేసే వాహనాలు రవాణా శాఖ నిర్దేశించిన ధరలనే వసూలు చేయాలన్నారు. ధరల వివరాలు ప్రతి స్టాక్ పాయింట్ వద్ద ఫ్లెక్సీల రూపంలో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి చంద్రశేఖర్, ఉప రవాణా శాఖ కమిషనర్ కరీం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నారాయణ, డీపీఓ శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణం గణపతిరావు నగర్‌లోని ఇందిరానగర్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సోమవారం భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందిన హెల్త్ సెంటర్‌లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా అమలు చేస్తున్నారో పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇందిరానగర్ యూపీహెచ్‌సీ రాష్ట్రంలో తొలి ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందిందని తెలిపారు. గత ఏడాది హెల్త్ సెంటర్ నాణ్యత ప్రమాణాలలో 12 విభాగాలకు సంబంధించిన ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందిందని తెలిపారు. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వచంద్ర సందర్శించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, నేషనల్ హెల్త్ మిషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ రత్నం మన్మోహన్, డీపీఓ సైమన్, స్టేట్ కన్సల్టెంట్ వేణు, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ అనూష, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎ.శ్రీమన్నారాయణ, హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలం నందిగామలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. అచ్చంపేట మండలం బొల్లాయపాడు గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ (24) కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో సత్తెనపల్లి మండలం నందిగం గ్రామానికి చెందిన స్నేహితుల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చి సోమవారం నిర్వహించిన ఓ పార్టీలో పాల్గొన్నాడు. అనంతరం శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు పెట్టుకున్నాడు. ఘటనలో శరీరం కాలిపోయింది. లక్ష్మీనారాయణను ఏరియా వైద్యశాలలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.